# జంధ్యాల పాపయ్య శాస్త్రి (4-8-1912 - 21-6-1992)

**ఆచార్య జి. అరుణ కుమారి**

**తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం**

1. జననం :గుంటూరుజిల్లా (కొప్పఱ్ఱు) కొప్పర్తి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు మహాలక్ష్మి, పరదేశి.
2. విద్యాభ్యాసం: కొమ్మూరు, మోపిదేవి, పెదచెరుకూరు గ్రామాలలో సంస్కృతం, తెలుగు భాషలు నేర్చుకున్నారు. హిందీ భాషలోనూ పాండిత్యం గడించారు.
3. వృత్తి : హిందీ, తెలుగు పండితులుగా గుంటూరు క్రైస్తవ కళాశాలలో అధ్యాపక వృత్తిని చేపట్టారు.
4. రచనలు: మొట్టమొదటి రచన 'తప్పులేని తమ్ముడు' సంఘ సంస్కరణ గేయం. ఉదయశ్రీ 1944, విజయశ్రీ 1946, కరుణామయి 1946, అరుణకిరణాలు, స్వప్న వాసవ దత్తము నాటకం 1951, కళ్యాణ కల్పవల్లి 1956, వీరభారతి, తెలుగు బాల శతకము 1961, కళ్యాణ కాదంబరి, సీత గేయ నాటిక, ఉమర్ ఖయ్యాం రుబాయీలను అమర్ ఖయ్యాం పేరుతో తెలుగులో అనువదించారు. సుభాషిణి మాసపత్రికను నడిపారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి 'అమర్ ఖయ్యాం'కు ముందుమాట రాసారు.
5. కలం పేరు: మొదటి కలంపేరు 'భరద్వాజ'. ఆ తరువాత 'కరుణశ్రీ'గా స్థిరపడింది.
6. బిరుదు: కవితా కళానిధి.
7. పురస్కారాలు: 1961లో అఖిల భారత కవి సమ్మేళనంలో కరుణశ్రీని ఘనంగా సత్కరించారు. 1982లో విజయవాడలో సువర్ణఘంటా కంకణ కనకాభిషేకం పొందారు. గౌరవ డి.లిట్ పట్టానుపొందారు.

   1950-52లో అభిసారిక, రేరాణి పత్రికల లోపలి అట్టల్లో వడ్డాది పాపయ్యగారి బొమ్మలు యువకులను ఉర్రూతలూగించేవి.

"అంజన రేఖ వాల్గనుల యంచులు
దాట మనోజ్ఞ మల్లికాకుంజము
లో సుధామధుర కోమలగీతము
లాలపించు ఓ కంజదళాయతాక్షి" సాంధ్యశ్రీ, పుట 52

అని మొదటి లోపలి అట్టమీద బొమ్మ కింద పద్యం రాసేవారు.

"సంజ వెలుంగులో పసిడి ఛాయల
ఖద్దరు చీరకట్టి నారింజకు నీళ్ళువోయి
శశిరేఖవే నీవు " సాంధ్యశ్రీ, పుట 52

జాతీయ భావం ప్రకృతి వర్ణనలోను కనిపిస్తుంది. సంధ్యాసమయానికి స్త్రీత్వమిడి ఆమెకు పసిడి ఛాయల ఖద్దరు చీర కట్టి జాతీయ భావాన్ని ప్రకృతికి అపాదించిన తీరు అద్భుతమనిపిస్తుంది.

తిరుపతి వేంకట కవులు, చిలకమర్తి తరువాత పద్యరచనలో తెలుగు ప్రజలను అలరించిన వారు విశ్వనాథ, జాషువా, కరుణశ్రీ. ఖండకావ్య ప్రక్రియకు త్రివేణిలా నిలుస్తారు. గురజాడ, రాయప్రోలు, అబ్బూరి, కృష్ణశాస్త్రి, వేదుల, కరుణశ్రీ, జాషువా, ఏటుకూరి వెంకటనరసయ్య, మాధవపెద్ది బుచ్చి సుందరామశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, బోయి భీమన్న, ఉత్పల సత్యనారాయణ, విద్వాన్ విశ్వం, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి ఉమర్ఆలీషా ఖండకావ్య రచయితలుగా గుర్తుకొస్తారు. కరుణశ్రీ పుష్పవిలాప రచనకు పూర్వం కోదాటి రామకృష్ణరావు రచించిన సుమవిలాపం గోలకొండ కవుల సంచికలో 1934లో అచ్చయ్యింది.

"త్రుంచినాడవు కఠిన నాదోసమేమి
విడువ లేవే జీవంబుల, వీడు వరకు
పడయ ద్రోచితి నీవు నాపరిమళంబు
పారవేయుదు నను మంటి బడి నశింప"

సుమ విలాపము

సుమ విలాపాన్నిపోలిన రెండు పాదాలు పుష్ప విలాపంలో కనిపిస్తాయి. భావసామ్యం ఒక్క పాదంలో మాత్రమే కనిపిస్తుంది.

"మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ జీవిత మెల్ల
మీకయి త్యజించి కృశించి నశించిపోయే మా
మానమెల్ల కొల్లగొని ఆపయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారబోతురు గదా! నరజాతికినీతి యున్నదా"

పుష్ప విలాపము, పుట 64

పూలబాసలో, రొదలో, ఆక్రందనలో స్వాతంత్రం కోసం ఆత్మత్యాగం చేసిన వారి గొంతులు వినిపిస్తాయి. భారత దేశపు అహింసా తత్వాన్ని ప్రవచించినట్టుగాను, మానవత్వంలేని భక్తి నిరర్ధకమనే సందేశాన్ని అందిస్తున్నట్లుగాను అనిపిస్తుంది.

"బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి"

ప్రకృతిలో వికసించిన పుష్పాలు తమకూ ఒక జీవిత లక్ష్యం ఉందనే భావాన్ని ప్రత్యక్షంగా అందించినా త్యాగధనుల త్యాగాన్ని పరోక్షంగా పఠితకు ఈ పుష్పవిలాప కావ్య ఖండిక అందిస్తుంది. పుష్పాల జీవిత లక్ష్యాలను స్వేఛ్చాపుష్పాలు, సార్ధకత అనే ఖండికల్లో అందించారు.

"ధన్యమూర్తులు నడిచెడి దారులందు
కాపురము సేయగా కోర్కెగలదు మాకు"

"త్యాగమూర్తుల పాదపరాగ మొడల
పులుము కొన నెంతయో కాంక్షగలదు మాకు"

"కష్టజీవుల నిట్టూర్పులందు
కమిలిపోవగ కోరిక గలదు మాకు"

"స్వాతంత్ర రథము చక్రాల క్రింద
నలిగిపోవ సముత్కంఠ గలదుమాకు"

"దాస్య బంధ విముక్తి స్వతంత్ర భరత
మాతృ కంఠాన ఒక పుష్పమాల యగుచు
పులకరింపగ అభిలాషగలదు మాకు"

ఉదయశ్రీ, స్వేఛ్చాపుష్పాలు, పుట 108,109.

"తల్లి చల్లని కాళ్ళపైన
రాలి కనుమూసి కొనుటె సార్థకత మాకు"

ఉదయశ్రీ, సార్థకత, పుట 107.

పుష్పాలకు గుడిలోపల హాయిగా కూర్చున్న దైవాల తలకెక్కితైతక్కలాడి కులకాలని లేదు. మిళింద బృందాలకు మకరందమవ్వాలని కౌతుకం లేదు. మోహనాంగుల ముడుల మీద ఫేషనులు దిద్ద అభిలాష లేదు. వలపు కౌగిళ్ళలో నలిగి పరవశత పొందాలనే సంబరంలేదు. స్వాతంత్ర సమరంలో జీవితాలను అర్పణ చేసిన త్యాగధనులు నడిచేదారిలో కాపురం చేయాలని, దేశదాస్య విముక్తికై దీక్ష పూని బంధిఖానాలలో బ్రతుకులు బలిచేసిన త్యాగమూర్తుల పాదధూళిని ఒడలంతా పులుముకొవాలని, తాగడానికి గంజిలేని కష్టజీవుల నిట్టూర్పుల కాకలలో కమిలిపోవాలని, స్వాతంత్ర రథచక్రాల క్రింద నలిగిపోయి వాలని భరతమాత కంఠానమాలగా నిలవాలని, నరులు పుష్పాలను ఉపయోగించే పద్ధతిలో అనందం లేదని వారికి కావలసిన ఉచ్చిష్ట జీవితాన్ని కోరుకున్నాయి.

"ఈ కరుణామయీ హృదయమే ఒక ప్రేమ మహాసముద్రమై లోకము నిండెరా. కడుపులో బడబాగ్నిని దాచి; కాంక్ష మఙ్జాకయి తేలే;" అని రాధ హృదయం కరుణ రససంద్రమయ్యింది. శ్రీయుత మూర్తియై కరుణ చిందెడి చూపులతోడ స్వామి వేంచేస్తాడని రాధ ఎదురుచూస్తుంది. కృష్ణుని చూపులో, రాధ హృదయంలో, బుద్ధభగవానుని గారాబుపుత్రి శ్రీ కరుణాకుమారిలోను, రమణుడు లేక మేడలు అనే ఘోరవుటరణ్యాలలో పడిన ఊర్మిళాకుమారిలోను కనిపించేది కరుణరసం, పౌరాణిక పాత్రలలోను పరోక్షంగా జాతీయ భావాలను చూపగల జాతీయకవి కరుణశ్రీ. పద్యానికి నడక నేర్పిన కవి కరుణశ్రీ.

"అది రమణీయ పుష్పవన మావనమందొక మేడ మేడపై
నదియొక మాఱుమూలగది ఆగది తల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల బాలిక, పోలిక రాచపిల్ల జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందికి, మెట్ల మీదునన్"

కుంతీకుమారి, పుట 66.

ఈ పద్యం పోతన భాగవతంలోని "అలవైకుంఠ పురమ్ములో నగరిలో ఆమూల సౌధంబుదాపల మందార వనాంతరామృత సరసి ప్రాతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోదియై" అనే పద్యాన్ని తలపింప చేస్తుంది. పద్యానికి నడక నేర్పి దృశ్య చిత్రీకరణ చేయటం, పద్యాలకు బొమ్మలు కట్టి కదిలేట్లు చేయడం, పౌరాణిక పాత్రలను వర్తమాన దృష్టితో చూపించటం కరుణశ్రీ కవిత్వంలో కనిపించే ప్రత్యేకత. కొందరు కవులు మాటలకు బొమ్మలు కడతారు. కరుణశ్రీ వంటి కవులు పద్యాలకే బొమ్మలను నడిపిస్తారు.

పౌరాణిక పాత్రలకు జాతీయ భావాన్ని ప్రత్యక్షంగా అద్దిన రూపం పద్యాలలో ప్రతిబింబిస్తుంది.

'ఫెళ్ళుమనె విల్లు గంటలు ఘల్లుమనె గు
భిల్లుమనె గుండె న్నిపులకు ఝుల్లుమనియె
జానకీ దేహ.................'

ధనుర్భంగము, ఉదయశ్రీ పుట 76

రాముడు శివధనువును విరిచి సీతను పెండ్లాడే ఘట్టాన్ని కరుణశ్రీ నాటకీయంగా మలిచిన తీరు, ఈ ఖండ కావ్యంలోని వస్తువు. రామునిలో భారత ప్రజలను, ఈ శివధనుర్భంగం చేసిన రాముడిని చూసి తెల్లమొగాలేసిన ఖండఖండాంతర దొరలలో బ్రిటీషు వారిని తలపింప జేసారు కవి.

"చెల్లరే విల్లు విరిచునే నల్లవాడు
పది పదారేండ్ల యెలరాచపడుచువాడు
సిగ్గుసిగ్గంచు లేచి గర్జించినారు
కనులుగుట్టిన తెల్లమొగాలవారు"

పుట - 76

'ఏగతి రచించినా సమకాలము వారు మెచ్చరన్న' చేమకూర వేంకటకవి పలుకులకు అపవాదుగా నిలిచినవారు జంధ్యాల పాపయ్య. 'ఒక జాతి కలకాలం జ్ఞాపకముంచు పద్యరచనా శిల్పాన్ని, శైలీ రుచినీ సృష్టించగల వాడే మహాకవి. ఆ లక్షణం కరుణశ్రీ కలానికి పుట్టుకతో వచ్చిన మహాగుణం'.

(జి.వి.సుబ్రహ్మణ్యం, ముత్యాలముచ్చట్లు, పుట 104)

అభినవ కావ్యానుభూతిని అందించిన కవులలో జంధ్యాల ఒకరు. స్వాతంత్ర్య పోరాటం, జాతీయ భావం, దేశభక్తి వీరి రచనలో ప్రధానంగా కనిపిస్తుంది. ఒకవైపు తెల్లదొరల పాలనలో సాహిత్యంలో కూడ అస్వతంత్రత కనిపించటాన్ని కరుణశ్రీ నిరసించారు.

'నేనొక దగ్ధ జీవనుడనే అయినాను. మదీయ మానవో
 ద్యానము నిండ రక్కసిపొదల్ చిగిరింతలు గారకంపలే
 గాని, పదేపదే పయిరు గాలికి నూగు గులాబి గుత్తులే
 కానగరావు - స్వేచ్ఛయును గల్గనే యీ కరుణావిహారికిన్'
'నేనొక వెట్టి మొట్టి కవినే అయినాను - మదీయ జీవితా
 ఖ్యానమునందు క్లిష్టగతి కష్టసమన్వయ దుష్ట సంధులే
 కాని, సుగమ్య సుందర సుఖంకర సూక్తి సువర్ణ పంక్తియే
 కానగరాదు-బోధమును గల్గనే యీ కవితావిలాసికిన్'

అస్వతంత్రుడు, పుట 94

గాయక విపంచిపై విషాదగీతులేకాని ప్రమోదగీతాలు కానగరావని, నాటక స్థానంలో సకిలింతలు చప్పరింతలే తప్ప మెచ్చుకోలు లేదని, కష్టకర్షకునికి పంటపైరులు కానగరావని సమాజంలోని కవి, కర్షక, గాయక, నటుల పరిస్థితిని ఆస్వతంత్రతను వివరించారు.

'నేనొక నష్టజాతకుడనే అయినాను-మదీయ జన్మచ
 క్రాన కుజాష్టమాది కుటిలగ్రహ కుండలి క్రూరదృష్టులే
 కాని, త్రికోణ కేంద్ర శుభగ్రహ వీక్షణ సామరస్యమే
 కానగరా దదృష్టము గల్గనె యీ దురదృష్ట మూర్తికిన్'

భావకవితా లక్షణాలు వీరి కవిత్వంలో మెండుగా ప్రత్యక్షమవుతాయి. ఆత్మాశ్రయత్వం, ఆత్మార్పణ, ఆరాధన, ఆత్మసౌందర్యం, జీవకారుణ్యం, స్త్రీపట్ల ఉదాత్తభావన, భక్తి, దేశభక్తి, ప్రకృతి ప్రీతి, శాంతి, మానవత్వం, అహింస, నిస్వార్థ ప్రేమ, వీరి కవిత్వంలో కనిపించే కవితాతత్త్వం. కరుణశ్రీ కవిత్వంలో ధారశుద్ధి ఉంది. చదివించే గుణం పద్యరచనకుండాలి. పద్యకవి కరుణశ్రీ పద్యం ఎత్తుగడలోను, నిర్వహణలోను, ముగింపు లోను పదాల ఎన్నికలోను, సంయోజనంలోను, యతిప్రాసల కూర్పులోను ధారాశుద్ధి ఆధారపడి ఉంటుంది.

మెత్తగా తప్ప పద్యం చెప్పలేని కవి కరుణశ్రీ. ప్రసన్నత, అక్షరరమ్యత కరుణశ్రీ కవిత్వంలో కనిపిస్తుంది.

(కవిత్వానుభవం, చేకూరి రామారావు, పుట 28)

భగవంతుని ఆరాధనలోను మనసును హత్తుకునే పద్యాల రచనగావించారు. విరాట్ స్వరూపాన్ని ప్రార్థించి ఆహ్వానించిన తీరును గమనిస్తే భగవంతుడిని ఎంత ప్రేమగా సహజంగా హత్తుకున్నారో తెలుస్తుంది.

‘కూర్చుండ మాయింట కురిచీలు లేవు
నా ప్రణయాంక మే సిద్ధ పరచనుంటి
పాద్యము నిడ మాకు పన్నీరు లేదు నా
కన్నీళ్ళతో కాళ్ళు కడగనుంటి......
రమ్ము దయసేయు మాత్మ పీఠమ్ముపైకి’,

అంజలి, పుట 28

భగవంతుని ప్రార్థించటానికి  దీర్ఘ సమాసాలు, శ్లోకాలే అవసరం లేదు. మనసులో మాటను భగవంతునికి నివేదించే పద్ధతికి, సామాన్య మానవుని మనోగతానికి అద్దం పడుతుంది ఈ కవిత.

‘ఎలుక గుఱ్ఱము మీద నీరేడు భవనాల
పరువెత్తి వచ్చిన పందెకాడు....
లడ్డూ జిలేబి హల్వాలె యక్కరలేదు
బియ్యపుండ్రాళ్ళకే చెయ్యిచాచు...
పంచభక్ష్యాలకై మొండిపట్టులేదు
పచ్చి వడపప్పితిను వట్టి పిచ్చి తండ్రి’

ఉదయశ్రీ, నమస్తే, పుట 111-113

వినాయక స్తుతిలోనే ఎంత దయ, ఎంత కరుణ బుజ్జగింపు, లాలింపు, చిన్న పిల్లవాడి చేష్టలను వెనకేసుకొచ్చే తల్లి మనసు ఈ కవితలో ధ్వనిస్తుంది. చిన్న చిన్న వాటికే పొంగిపోయే గొప్ప మనసున్న వాడు వినాయకుడని, వినాయకుని మనస్సును చిత్రించిన కవి కరుణశ్రీ.

‘కరుణశాంతి నిచ్చు కరుణ కాంతి నొసగు
కరుణ లేని వాడు ధరణిలేడు
కరుణ శుభము నిచ్చు పరమ సౌఖ్యము నిచ్చు
కరుణ లేని నరుడు గడ్డిబొమ్మ’

పుట 138

పౌరాణిక పాత్రలలో జాతీయ భావాలను, నవరసాలను కరుణరసంలో ముంచెత్తిన కవి కరుణశ్రీ. ఏకో రసః కరుణ ఏవః అనే  సిద్ధాంతాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించిన ఆధునిక కవి జంధ్యాల పాపయ్య శాస్త్రి.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. చేకూరి రామారావు - కవిత్వానుభవం
2. జి. వి. సుబ్రహ్మణ్యం - ముత్యాల ముచ్చట్లు.
3. కరుణశ్రీ - ఉదయశ్రీ